www.jananinadam.com
RNI NO:TGTEL/25/A0870
Follow:

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక

**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ. అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న **జననినాదం** తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను.

**సంప్రదించాల్సి నెంబర్**

9550100197,9490111460

బుధవారం 15-07- 2026
సంపుటి: 2 సంచిక: 79

ఆసిఫాబాద్ Asifabad | హైదరాబాద్ Hyderabad

ఎడిటర్ : జాధవ్ రోహిదాష్
Editor: JADAV ROHIDAS

పేజీలు : 04
వెల: రూ.2.00

Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com



## ఖేలో ఇండియా యూత్ గేమ్స్కు తెలంగాణ ఎంపిక

**కేంద్రమంత్రి మన్సూఖ్ మాండవియాకు మంత్రుల కృతజ్ఞతలు**

**హైదరాబాద్,జూలై14:** 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్కు తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను కేంద్ర యువజన వ్యవహారాలు / క్రీడల శాఖ మంత్రి మన్సుక్ మాండవియాను రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలు కలిసి ధన్యవాదములు తెలిపారు. 2026లో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్కు తెలంగాణను ప్రకటించిన అనంతరం హైదరాబాద్ కు వచ్చిన కేంద్రమంత్రి మన్సుక్ మాండవియను మంత్రి వాకిటి శ్రీహరి కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కేంద్రం ప్రోత్సాహంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను క్రీడారంగంలో అగ్రగామిగా నిలుపుతామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేసారు.



## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

2వ పేజీలో...

**ఢిల్లీ: 14:** రీజినల్ రింగ్ రోడ్డు (FFF) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయిన నేపథ్యంలో పనుల ప్రారంభానికి కేంద్ర మంత్రిమండలి అనుమతి ఇప్పించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కి విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలు రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తికావడమే కాకుండా నిర్మాణ వ్యయం తగ్గుతుందని వివరించారు.కేంద్ర మంత్రి గడ్కరీ తో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయాలని ఈ సందర్భంగా కోరారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిట నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్ - విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని వివరించారు. హైదరాబాద్ నుంచి బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని తెలిపారు మన్ననూరు - శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు



## ఎస్ఐఆర్ గడువు పొడిగించాలి

## ఈసీకి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి

- **హైదరాబాద్లో 21 శాతం ఓటరు సవరణ మాత్రమే పూర్తయిందన్న పొన్నం**
- **ఇంకా 10 రోజుల గడువు మాత్రమే ఉందన్న మంత్రి**
- **ప్రక్రియ పూర్తి కావడానికి ఈ గడువు సరిపోదని వెల్లడి**

తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ గడువును పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రతినిధుల బృందం విజ్ఞప్తి చేసింది. ఓటరు నమోదు ప్రక్రియకు మరింత సమయం కావాలని కోరారు.హైదరాబాద్ లో ఓటరు సవరణ ప్రక్రియ నత్తనడకన సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కేవలం 21 శాతం ఓటరు సవరణ మాత్రమే పూర్తయిందని, ఇంకా 10 రోజుల గడువు మాత్రమే ఉందని చెప్పారు. మొత్తం ప్రక్రియను పూర్తి చేయడానికి ఈ సమయం సరిపోదని... ఎస్ఐఆర్ గడువు




## బస్తీ దవాఖాన లో చికిత్స సౌకర్యాలు మెరుగుపరచాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్**

2వ పేజీలో...

**హైదరాబాద్ 14:** హైదరాబాద్ జూబ్లిహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ వినాయకనగర్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్ జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంకా అలా, డిఎంహెచ్ వో శ్రీనివాస్ మెడికల్ ఆఫీసర్ డా,, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ముందుగా మంత్రి బస్తీ దవాఖాన పరిశీలించారు. రోగులకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. బస్తీ దవాఖాన లో ప్రతి రోజు 100-150 ఓపీ వస్తుందని మంత్రి గారి దృష్టికి తీసుకొచ్చారు.. దవాఖాన లో ఓపీ సంఖ్య పెంచాలని రోగుల పట్ల దయనీయంగా వ్యవహరించాలని సూచించారు. స్వయంగా షుగర్ టెస్ట్ , బ్లడ్ టెస్ట్ ,బీపీ టెస్ట్ చేసుకున్నారు. .బస్తీ దవాఖాన లో రోగులకు అవసరమైన అన్ని రకాల పరీక్షలు లేదు అనకుండా చేయాలని అధికారులను ఆదేశించారు.బస్తీ దవాఖాన లో చికిత్స సౌకర్యాలు మెరుగుపరిచి ప్రజల్లో నమ్మకం కలిగించే హైదరాబాద్ లో ఉన్న 169 బస్తీ దవాఖాన



## తెలంగాణలో మరో పాదయాత్ర రంగంలోకి హరీష్ రావు

**హైదరాబాద్ 14:** తెలంగాణ మాజీ మంత్రి హరీశ్‌రావు త్వరలో బసవేశ్వర నుంచి సంగమేశ్వర' వరకు భారీ పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. నిలిచిపోయిన బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేయడం, రైతుల సమస్యల పరిష్కారమే ఈ యాత్ర ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేసి రైతులకు అన్యాయం చేసిందని ఆరోపించిన ఆయన, సింగూరు నీటి వినియోగం, క్రాప్ హాలిడే పరిహారం, పంటల బీమా, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాడటవే పాదయాత్ర ఉద్దేశమని పేర్కొనగా, యాత్ర పూర్తి షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని పార్టీ వర్గాలు వెల్లడించాయి.



## అలంపూర్ లో విద్యుత్ అభివృద్ధి పనులకు శ్రీకారం

**పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి .. మంత్రులు జూపల్లి, వాకిటి**

2వ పేజీలో...

**జోగులాంబ14:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో నేడు సుమారు రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం సంతోషకరమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతులకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలనే లక్ష్యంతో ఎర్రవల్లి వద్ద రూ.155 కోట్లతో 220/132/33 కేవీ, గట్టు మండలం రాయపురం వద్ద రూ.48 కోట్లతో 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని అన్నారు.అలాగే వడ్డేపల్లి, రాజోలి, ఐజ, మల్దకల్ మండలాల పరిధిలోని జులకల్, పచ్చర్ల, మేడికొండ, అరగిద్ద, తుమ్మలచెరువు, కుర్తిరావల్ చెరువు, సోమాపురం, పెద్దపాడు, ఉలిగెపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలను ప్రారంభించి, రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం స్థానిక ప్రజలతో ముఖాముఖి నిర్వహించి వారి అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకున్నానని అన్నారు.రాష్ట్రంలో నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు మా ప్రజా ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉంది. వ్యవసాయం, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధికి



## సొంత ప్రభుత్వం పోలీస్ అధికారులపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ఆగ్రహం

**హైదరాబాద్ 14:** పోక్సో కేసులో అరెస్ట్ అయిన నిందితుడు రాజ్ కుమార్ బెయిల్పై విడుదల కావడానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి మండిపడ్డారు. రాజ్ కుమార్ దగ్గర లంచం తీసుకుని పోలీసులు విడుదలకు సహకరించారన్న విషయం తెలిసి షాక్కు గురయ్యాను. పోలీసులు చేసిన తప్పుతో నిందితుడు ఆరుగురి ప్రాణాలను కడతేర్చాడు. మహిళలకు ప్రాధాన్యమిస్తామని చెబుతున్న కాంగ్రెస్ పాలనలో ఇలాంటి దుర్ఘటన జరగడం చాలా బాధాకరం, ప్రభుత్వం ఈ ఘటనను సీరియస్గా తీసుకుని తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించి, మహిళల శాంతి, భద్రతలను కాపాడాలని ఆమె అన్నారు.



## ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ బాధితులకు న్యాయం చేయండి

**సీఎం రేవంత్ కు ఎంపి మల్లు రవి విజ్ఞప్తి**

**నాగర్కర్నూల్ 14:** ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ బాధితుల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఒగ్గు పర్వతాలు కలిసారు.

ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ మోసాలకు గురైన బాధితుల పక్షాన ఒగ్గు పర్వతాలు ముఖ్యమంత్రిని కలిసి బాధితుల సమస్యలను,జరిగిన మోసాల వివరాలను పూర్తిగా వివరించారు. ఈ సందర్భంగా మోసాలకు పాల్పడిన వారి ఆస్తులు, భూములను వెంటనే జప్తు చేసి,బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని

2వ పేజీలో...



2వ పేజీలో...

## ముంబయిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి కందుల దుర్గేష్.. త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్ష**
**శస్త్ర చికిత్స జరిగిన ఈ పరిస్థితుల్లోనూ ప్రజాసేవ, పార్టీ నిర్మాణం, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా దిశానిర్దేశం చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన మంత్రి దుర్గేష్**

**అమరావతి14:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ముంబయిలో పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో కోలుకుంటున్న డిప్యూటీ సీఎంను మంత్రి దుర్గేష్ స్వయంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చాలా వేగంగా కోలుకుంటున్నారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు ఆయనకు ప్రస్తుతం తగిన విశ్రాంతి అవసరమని, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనూ నిరంతరం ప్రజాసేవ గురించే తపించడం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

# చాప కింద నీరులా అవినీతి చేపలు

## – పెద్దపల్లిలో దొరికిన మున్సిపల్ ఏఈ సతీష్ కుమార్

**పెద్దపల్లి14:** పెద్దపల్లి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ కల్లెపల్లి సతీష్ కుమార్ రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఈ నేపథ్యంలో ఈఏ ఇంట్లో రూ.32.31 లక్షల అక్రమ నగదు స్వాధీనం చేసుకున్నారు. మున్సిపాలిటీ అసిస్టెంట్ ఇంజనీర్ కల్లేపల్లి సతీష్ కుమార్ను కాంట్రాక్టర్ బిల్లు ప్రాసెస్ చేసి టీయూఎఫ్ఐడీసీకి పంపేందుకు రూ.2 లక్షల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా కరీంనగర్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు...నిందితుడి వద్ద నుంచి లంచం నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇంటి సోదాల్లో రూ.32.31 లక్షల లెక్కల్లో చూపని నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు.. నిందితుడిని అరెస్ట్ చేసి ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచారు.



# తెలంగాణ బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలి

## 12వ వేజ్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి

**గోదావరిఖని 14:** తాడిచర్ల బ్లాక్–2 ను సింగరేణికి కేటాయించినందుకు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కి నాయకుల కృతజ్ఞతలు తెలిపారు.సింగరేణి లో "భరోసా యాత్ర" పేరుతో మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా ఓసిపి–5 కి విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కి సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ వినతి పత్రం లో తెలంగాణలో ఉన్న బొగ్గు గను లను వేలం పాట లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని,12వ వేజ్ బోర్డు ఒప్పంద ప్రక్రియను ప్రారంభించేందుకు తక్షణమే వేతన కమిటీని ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్ లతో సంబంధం లేకుండా గతంలో వలే 12వ వేజ్ బోర్డు వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా సింగరేణికి తాడిచర్ల బ్లాక్–2 ను కేటాయించినందుకు కేంద్ర మంత్రి కి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. వినతి పత్రం అందజేసి , కేంద్ర మంత్రి కి డిమాండ్ లను వెల్లడించిన వారిలో సింగరేణి



కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శిమడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు ఉన్నారు, ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి నాయకులు మాదన మహేష్, బోగ సతీష్ బాబు, ఎస్. వెంకట్ రెడ్డి, గండి ప్రసాద్, మానాల శ్రీనివాస్, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, చంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం:

## తపస్ ధర్నాకు బీజేపీ మద్దతు డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

**కరీంనగర్14:** కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట తపస్ (టిపియుఎస్) ఉపాధ్యాయ సంఘం చేపట్టిన ధర్నాకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరై పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, కాలపరిమితితో చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు తిరుపతి రావు, ప్రభాకర్




రావు, సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదు**

**అటవీ?రెవెన్యూ సరిహద్దులు సంయుక్త సర్వేతో పరిష్కరించాలి**

**గోదావరిఖని 14:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి వీలైనంత త్వరగా విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం రామగుండం ప్రాంతంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఐటీఐ సమీపంలో కొనసాగుతున్న అటవీ?రెవెన్యూ కు సంబంధించిన సర్వేను పరిశీలించారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్‌లో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల పనులను తనిఖీ చేసి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేలా నిర్మాణ పనులు అత్యున్నత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉపయోగించే సామగ్రి నుంచి పనుల అమలు వరకు ప్రతి అంశాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని



సూచించారు.అనంతరం ప్రభుత్వ ఐటీఐ సమీపంలో కొనసాగుతున్న అటవీ రెవెన్యూ సరిహద్దు సర్వేను పరిశీలించిన కలెక్టర్, రెవెన్యూ మరియు అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించాలని ఆదేశించారు. సంబంధిత రికార్డుల ఆధారంగా పారదర్శకంగా సర్వే పూర్తిచేయాలని సూచించారు.ఈ పర్యటనలో డీఈ (పంచాయతీరాజ్) నాయుడు, ఏఈ (పంచాయతీరాజ్) రాజ్‌కుమార్, పెద్దపల్లి అటవీ పరిధి అధికారి (ఎఫ్ఆర్ఓ) టి. సతీష్ కుమార్, బీట్ ఆఫీసర్ ప్రదీప్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో రైతులకు సక్రమంగా యూరియా సరఫరా చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.**

**జయశంకర్ భూపాలపల్లి,14:** జిల్లాలో రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘన్‌పూర్ మండలంలోని పీఏసీఎస్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.?ఈ సందర్భంగా కేంద్రంలోని స్టాక్ బోర్డును పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడారు. యూరియా సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, యూరియా యాప్ ద్వారా బుక్ చేసుకోవడంపై అవగాహన ఉందా అని అడిగి తెలుసుకున్నారు. యూరియా కు ప్రత్యామ్నయంగా నానో యూరియాను వినియోగించాలని రైతులకు సూచించారు. గత ఏడాది జూలై 14వ తేదీ నాటికి ఎంత యూరియా కేటాయించారు, వినియోగం ఎంత జరిగిందో నివేదికలు



సమర్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి బాబూరావు, పశు సంవర్ధక శాఖ డిడి డా కుమారస్వామి, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపిడిఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ గడువు పొడిగించాలి

## ఈసీకి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి...

పొడిగించాలని డిమాండ్ చేశారు. 4,500 పోలింగ్ స్టేషన్లలో ప్రక్రియ నత్తనడకన సాగుతోందని మంత్రి వెల్లడించారు. బూత్ స్థాయి అధికారులు (దీరా) ఇళ్లకు రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు సరిగా ఇవ్వడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగిపోకూడదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు పార్టీ క్యాడర్ చురుకుగా పని చేయాలని సూచించారు. ఓటు లేకపోతే ప్రభుత్వ పథకాలు రావనే ప్రచారం జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భేటీలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ గడువు పొడిగింపుపై ఈసీ నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది

## అలంపూర్ లో విద్యుత్ అభివృద్ధి పనులకు శ్రీకారం

మొదటిపేజీ తరువాయి...

నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు జూపల్లి కృష్ణారావు , వాకిటి శ్రీహరి పార్లమెంట్ సభ్యులు మల్లు రవి , జిల్లా శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు మరియు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్

## బాధితులకు న్యాయం చేయండి

మొదటిపేజీ తరువాయి...

ముఖ్యమంత్రిని కోరారు.ముఖ్యంగా పేద రైతులు,సామాన్య ప్రజలు తమ జీవితకాల డబ్బులను కోల్పోయినందున ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా.మల్లు రవి కూడా పాల్గొన్నారు.బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఒగ్గు పర్వతాలు స్పష్టం చేశారు.

## ముంబయిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్

మొదటిపేజీ తరువాయి...

పట్టుదలకు నిదర్శనమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ క్షేత్రస్థాయి బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన దిశానిర్దేశం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆయన పార్టీ నిర్మాణంపై చూపిస్తున్న అంకితభావాన్ని మంత్రి దుర్గేష్ కొనియాడారు.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసిన వారిలో మంత్రి దుర్గేష్ తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ (ఏపీఎంఎస్ఐడీసీ), చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు..

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

మొదటిపేజీ తరువాయి...

ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని గుర్తుచేశారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల రహదారికి అనుమతులు మంజూరు చేయాలని నితిన్ గడ్కరీ ని కోరారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు.? ఈ సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖాన లో చికిత్స సౌకర్యాలు మెరుగుపరచాలి

మొదటిపేజీ తరువాయి...

లకు ప్రత్యేక అధికారులను నియమించామని వారు బస్తీ దవాఖాన లో విజిట్ చేసి రోగుల కు అందుతున్న చికిత్స ,హాస్పిటల్ మౌలిక సదుపాయాలు, ఓపీ సంఖ్య పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఒక నివేదిక అందించాలని ఆదేశించారు.హైదరాబాద్ బస్తీ దవాఖాన లు రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండేలా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వద్ద అవసరమైన చర్యలు తీసుకునేలా ఈ కార్యక్రమం చేపట్టారు.

# రామగుండం సుందరీకరణకు మరో ముందడుగు..

## ఐలాండ్ నిర్మాణానికి స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**గోదావరిఖని14:** రామగుండం నియోజకవర్గాన్ని మరింత అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గారు ఈరోజు రామగుండంలోని ం–పవర్ హౌస్ సర్కిల్ వద్ద ప్రతిపాదిత ఐలాండ్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులను పరిశీలిస్తూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఐలాండ్‌ను ఆధునిక నమూనాలో అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పైలాన్ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

**ములుగు14:** ములుగు జిల్లా అభివృద్ధి పనులను ప్రతిబింబించే పైలాన్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు పరిశీలించారు.ములుగు గట్టమ్మ వద్ద జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, జిల్లా ప్రగతిని ఒకేచోట ప్రతిబింబించేలా ఏర్పాటు చేస్తున్న పైలాన్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న కలెక్టర్, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ పైలాన్ను ప్రారంభించే అవకాశం ఉన్న నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల అమలులో ఎలాంటి రాజీ పడకుండా నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు.అనంతరం నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయం ఆవరణలో



చేపడుతున్న ల్యాండ్స్కేపింగ్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తూ మొక్కలు నాటాలని, లాన్ అభివృద్ధి, అలంకరణ మొక్కల ఏర్పాటు, నడక మార్గాల నిర్మాణం, సుందరీకరణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి ఆవరణను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు

# ఎల్–1 కచ్చా ఇండ్ల పరిశీలన వేగవంతం చేయాలి

**క్షేత్రస్థాయిలో తనిఖీలు పూర్తి చేసి వెంటనే నివేదికలు సమర్పించాలి**

**మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని**

**అధికారులకు కలెక్టర్ కె. హరిత ఆదేశం**

**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 14:** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎల్–1 జాబితాలో ఉన్న కచ్చా ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులపై వెంటనే నివేదికలు సమర్పించాలని కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు, గెజిటెడ్ అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ఎంపిక ప్రక్రియలో భాగంగా ఎల్–1 జాబితాలో నమోదైన కచ్చా ఇళ్లను ప్రత్యక్షంగా పరిశీలించి నివేదికలు న్నారు.జిల్లాలో మొత్తం 2,300 కచ్చా ఇళ్ల వివరాలు నమోదుకాగా, ఇప్పటివరకు 1,800 ఇళ్ల పరిశీలన పూర్తయిందని, మిగిలిన 500 ఇళ్ల పరిశీలనను అత్యవసరంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో ఎదురయ్యే సమస్యలను వెంటనే గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మొదటి విడతలో జిల్లాకు 9,306 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వాటిలో ఇప్పటివరకు 683 ఇళ్లు



పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులు లబ్ధిదారులతో నిరంతరం సమన్వయం చేసుకుని నిర్మాణాలను వేగవంతం చేయాలని, బిల్లుల చెల్లింపులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా, ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

జననినాదం

బుధవారం 15 జూలై2026

# ఆపరేషన్ ముస్కాన్ సమర్థవంతంగా అమలు చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 14: జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, బాల కార్మికులు, వీధి బాలలు, ప్రమాదకర పరిస్థితులలో ఉన్న చిన్నారులను గుర్తించి తక్షణమే రక్షించేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని హోటళ్లు, దాబాలు, టీ స్టాళ్లు, గ్యారేజీలు, వర్క్‌షాపులు, పరిశ్రమలు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులు, షాపింగ్ సముదాయాలు, వ్యవసాయ క్షేత్రాలు తదితర ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించి వెంటనే రక్షించాలని అధికారులను ఆదేశించారు. రక్షించిన ప్రతి చిన్నారికి వైద్య పరీక్షలు, కౌన్సిలింగ్, విద్యలో పునఃప్రవేశం, కుటుంబ పునరావాసం / అవసరమైతే బాలల సంరక్షణ సంస్థలలో ఆశ్రయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులు, చిన్నారులను దుర్వినియోగం చేసే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి నేరపూరిత చర్యలను అరికట్టాలని పోలీసు శాఖకు సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్--శ×× లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని, ప్రతి రెస్క్యూ చర్యను పకడ్బందీగా నమోదు చేసి, సంబంధిత శాఖలకు సకాలంలో నివేదికలు సమర్పించాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణపై ప్రజలలో చైతన్యం కల్పించాలని, బాలల రక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అనే సందేశాన్ని ప్రజలలోకి తీసుకెళ్లాలని తెలిపారు.డి.సి.పి. మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై జరుగుతున్న దోపిడీ వంటి అంశాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై రాజీ పడకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, కార్మిక, విద్యా, వైద్య ఆరోగ్య, రెవెన్యూ శాఖల అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ యూనిట్, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు

# నిబంధనల ప్రకారం పోడు భూముల సమస్యల పరిష్కారం



జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 14: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టంకు లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం ఎడగట్ట గ్రామంలో నిబంధనలను అతిక్రమించి సాగు చేస్తున్న అటవీ భూములను జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, కోటపల్లి సి.ఐ. కృష్ణ, అటవీ డివిజనల్ అధికారి సర్వేశ్వర్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టానికి లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. చట్టం ప్రకారం 2005 కు ముందు సాగులో ఉండి పట్టా పొందిన అర్హులైన గిరిజన రైతులకు మాత్రమే చట్టం వర్తిస్తుందని తెలిపారు. చట్ట ప్రకారం 2005 నాటికి 75 సంవత్సరాలు కాస్తులో ఉండి పట్టా పొందిన గిరిజనేతరులకు మాత్రమే అవకాశం ఉంటుందని, 2005 తర్వాత నూతనంగా అటవీ భూములు సాగు చేస్తున్న వారు చట్ట పరిధిలోకి రారని తెలిపారు. అనర్హులు, నూతనంగా అటవీ భూములను సాగు చేయకుండా స్థానికులు అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. ఇట్టి భూములకు సంబంధించి చెన్నూర్ అటవీ రేంజ్ కార్యాలయంలో మ్యాప్ అందుబాటులో ఉందని, సందేహాలు ఉన్నవారు మ్యాప్ ను పరిశీలించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు



జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 14: ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయాలని, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్‌తో కలిసి హాజీపూర్ మండలం నమ్నూర్ గ్రామంలోని 123, 124, 125 నంబరు పోలింగ్ కేంద్రాలను సందర్శించి క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులు (దీూలు)తో మాట్లాడి ఇంటింటి సర్వే, వివరాల నమోదు, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పనులను వేగవంతంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితత్వంతో నమోదు చేయడంతో పాటు ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు కమ్యూనిటీ భవనానికి స్థలం, నిధులు మంజూరు చేయాలి

## ఎమ్మెల్యే కోవ లక్ష్మికి మున్నూరు కాపు సంఘం వినతి



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 14: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సామాజిక వర్గానికి కమ్యూనిటీ భవనం నిర్మించేందుకు 20 గుంటల స్థలంతో పాటు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం మున్నూరు కాపు సంఘం జిల్లా, పట్టణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కోవ లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ, ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ భవనం లేకపోవడం విచారకరమన్నారు. వివాహాలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడేలా బహుళార్థ సాధక కమ్యూనిటీ భవనం నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.వినతిపై స్పందించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని మున్నూరు కాపు సంఘానికి తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి అవసరమైన స్థలం, నిధుల మంజూరు అంశాన్ని ప్రభుత్వంతో పాటు సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనిశెట్టి సదాశివ్, పట్టణ అధ్యక్షుడు దేగల సత్యనారాయణ పటేల్, ప్రధాన కార్యదర్శి వోరగంటి సంతోష్, జిల్లా ఉపాధ్యక్షుడు దేగల రామకృష్ణ పటేల్, ఉపాధ్యక్షుడు తుపాకుల సాయిప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్ట వెంకటేష్, కోశాధికారి గోనే వినీష్, సలహాదారు జాపతి రమేష్, సహాయ కార్యదర్శి గంగిశెట్టి వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులు దేగల సురేందర్, జొన్నగడ్డల రవీ, రాపల్లి రాజయ్య, దేగల రవి, ఎం.జి. పెంటయ్య, రాగిశెట్టి రమేష్, ఉప్పు రాజు, అంగల వినోద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# చెలిమె నీరే దిక్కు

**నాయకపుగూడలో తాగునీటి దుస్థితి,**
**అధికారుల మౌనం**
**కలుషిత నీటితో వ్యాధుల భయం...**
**శాశ్వత పరిష్కారం కోరుతున్న గ్రామస్తులు**

జననినాదం,తిర్యాణి, జూలై 14: అభివృద్ధి, మౌలిక వసతులు, మిషన్ భగీరథ పేర్లు వినిపిస్తున్నా... వాస్తవానికి తిర్యాణి మండలం గోవెన గ్రామ పంచాయతీ పరిధిలోని నాయకపుగూడ గ్రామంలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. వర్షాకాలంలో చెరువులు, వాగులు, గుంతలు నీటితో నిండిపోయినా గ్రామస్తులకు మాత్రం తాగేందుకు స్వచ్ఛమైన నీటి చుక్క అందని ద్రాక్షగా మారింది. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం గ్రామంలో కనిపించక పోవడంతో ప్రజలు మళ్లీ చెలిమెలు, గుంతల్లో నిల్వ ఉన్న నీటిపైనే ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామంలో తాగునీటి కోసం మహిళలు, వృద్ధులు, చిన్నారులు ప్రతిరోజూ కిలోమీటర్ల దూరం నడిచి చెలిమెల వద్దకు వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా చెలిమెల నీరు పూర్తిగా కలుషిత మవుతున్నా, మరో మార్గం లేక అదే నీటిని తాగాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో గ్రామంలో జ్వరాలు, విరేచనాలు, కడుపు సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం ఈ సమస్య కొత్తది కాదు. నెలల తరబడి కొనసాగుతున్న తాగునీటి సమస్యపై పలుమార్లు మండల అధికారులకు, సంబంధిత శాఖ అధికారులకు, జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం



తాగునీటి కోసం చెలిమె తోడుతున్న గ్రామస్తులు



లేకపోయిందని ఆరోపిస్తున్నారు. అధికారులు వస్తామని చెప్పడం తప్ప, సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటిస్తున్నా, నాయకపుగూడ లో మాత్రం కనీస తాగునీటి సౌకర్యం కూడా అందుబాటులో లేకపోవడం ప్రశ్నలు రేకెత్తిస్తోంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉన్నా నీరు ఎందుకు రావడం లేదు? మోటార్లు పనిచేయడం లేదా? పైప్‌లైన్‌లో సాంకేతిక లోపాలున్నాయా? నిర్వహణలో నిర్లక్ష్యం జరిగిందా? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామస్తులు తాగునీటి కోసం పడుతున్న అవస్థలు రోజురోజుకూ తీవ్రమవుతున్నా సంబంధిత శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల సమస్య మరింత జటిలంగా మారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఏర్పడిన తర్వాత స్పందించడం కాకుండా, ముందస్తు చర్యలు తీసుకుని సురక్షితమైన తాగునీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అని గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, మిషన్ భగీరథ అధికారులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు స్పందించి నాయకపుగూడ గ్రామాన్ని సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.మిషన్ భగీరథ ద్వారా నిరంతర తాగునీటి సరఫరా పునరుద్ధరించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఉద్యోగాల భర్తీకి మహాధర్నా విజయవంతం చేయాలి

## సీపీఎం జిల్లా కమిటీ పిలుపు.. కరపత్రాల విడుదల



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 14: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్ మాట్లాడుతూ దేశంలో అత్యధిక యువశక్తి ఉన్నప్పటికీ నిరుద్యోగ సమస్య కూడా తీవ్రస్థాయిలో ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ శాఖల్లో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా వాటి భర్తీపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు.2014లో ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్లైనా ఆ వాగ్దానాన్ని అమలు చేయలేదని విమర్శించారు. తెలంగాణలోనూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో ఆశించిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయడంతో పాటు అప్పటి వరకు నిరుద్యోగ భృతి అందించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, జె. రాజేందర్, గోడిసెల కార్తీక్, యువజన నాయకులు రాజ్‌కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావం.. వరికి బదులు ఆరుతడి పంటలు

## రైతులకు కలెక్టర్ హరిత సూచన



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 14: జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు వరి సాగుపై ఆధారపడకుండా తక్కువ నీటి అవసరమయ్యే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ కె. హరిత సూచించారు. చెరువులు, కుంటలు, సాగునీటి ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండకపోవడం, భూగర్భ జలాలు తగ్గే అవకాశాలు ఉండటంతో వరి సాగుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు.బోరుబావుల ఆధారంగా సాగు చేసే రైతులు వరి విస్తీర్ణాన్ని తగ్గించి మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, కంది వంటి తక్కువ నీటి అవసరమయ్యే పంటలు సాగు చేస్తే నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. జూలై 31 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే ఆగస్టు మొదటి వారంలో కందులు, ఉలవలు, అలసందలు, ఆముదం, నువ్వులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగు లాభదాయకంగా ఉంటుందని తెలిపారు.గత వానాకాలంలో జిల్లాలో 47,576 ఎకరాల్లో వరి సాగు జరగగా, అందులో 22,876 ఎకరాలు బోరుబావుల ఆధారంగా, 24,700 ఎకరాలు చెరువులు, కుంటలు, వర్షాధారంపై సాగు జరిగినట్లు వెల్లడించారు. ఈసారి కూడా వర్షాధార రైతులు ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం ద్వారా నష్టాలను నివారించవచ్చున్నారు. పంటల ఎంపిక, విత్తనాల లభ్యత, సాగు విధానాలపై సందేహాలుంటే సమీప మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి వ్యవసాయ శాఖ సూచనల మేరకు సాగు చేపట్టాలని కలెక్టర్ రైతులకు సూచించారు.

# కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 14: జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సింగరేణి అతిథి గృహానికి విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, ట్రైన్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలి

**జననినాదం,సిద్దిపేట 14:** ఆరోగ్య కేంద్రాలలో రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి డాక్టర్లను ఆదేశించారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపి మెయింటెనెన్స్ ఎలా ఉంది, అందరూ సమయ వేళలు పాటిస్తున్నారా, మెడిసిన్ అందుబాటులో ఉందా అని మెడికల్ ఆఫీసర్ ను అడగ్గా సమయానికి వస్తున్నామని ఉదయం సాయంత్రం వేళల్లో ఎక్కువగా రోగులు వస్తారని ఏంఓ కలెక్టర్ కు తెలిపారు. పిఎచ్ సి కి వచ్చిన వృద్ధుని పలకరిస్తూ అనారోగ్య సమస్యలు ఏవైనా ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేసుకోవాలని, పెద్ద సమస్య వస్తే జిల్లా కేంద్రంలోని జీజీఎచ్ కి వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం నిరుపేదలకు వైద్యం చేయడం కోసం ఆసుపత్రులలో అన్ని సదుపాయాలు కల్పించిందని, తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ప్రైవేటు దావకానకు వెళ్ళి అనవసరంగా



డబ్బులు వృధా చేసుకోవద్దని తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త చర్యల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. పిహెచ్ సి ప్రాంతంలో పిచ్చి మొక్కలు తొలిగించి శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.

# ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పనిచేయాలి

**మాజీ ఎంపీ సోయం బాపూరావు**

**బాపూరావు ను కలిసిన సిరికొండ కాంగ్రెస్ నాయకులు**

**జననినాదం,సిరికొండ 14:** ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా కాంగ్రెస్ నాయకులు గ్రామస్థాయిలో చురుకుగా పనిచేయాలని మాజీ ఎంపీ, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు కంచం లక్ష్మణ్‌తో పాటు మండల ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతంతో పాటు గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. సిరికొండ మండల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు కుంరం చంద్రకళ రఘురాం, మాజీ సర్పంచ్‌లు కొట్నాక్ పాండు, పెందూర్ అనిల్,




రాజ్‌గోండ్ సేవా సమితి అధ్యక్షుడు కుంరం యాదవరావు, నేరడిగొండ జీపీ సర్పంచ్ పెందూర్ వందన గుణవంత్‌రావు, నారాయణపూర్ సర్పంచ్ చిక్రం విమలాబాయి రాము, కుంటాగూడ సర్పంచ్ కుంరం మీరాబాయి యాదవరావు, ఇచ్చోడ ఏఎంసీ డైరెక్టర్ పురక జగన్, బీఎల్‌ఏ సూపర్‌వైజర్ తొడసం భూపతి, మెస్రం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# యూట్యూబ్‌లో తప్పుడు ప్రకటనలు

**గేదెలు బర్రెలు విక్రయిస్తున్నట్లు నమ్మించి ప్రజలను మోసం చేసిన సైబర్ క్రైం నిందితుడు అరెస్ట్**

**జననినాదం,సిద్దిపేట 14:** మార్కూక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన సైబర్ మోసం కేసును గజ్వేల్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. రవి రాజు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు వివరాల్లోకి వెళితే, పల్లె సాయికిరణ్, తండ్రి శ్రీశైలం, నివాసం బీరంగూడ, అమీన్‌పూర్, లక్ష్మి డెయిరీ ఫార్మ్ పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తూ,గేదెలు,బర్రెలు అమ్మకానికి ఉన్నట్లు వీడియోలు అప్లోడ్ చేసేవాడు. వీడియోలలో చూపించిన ఫోన్ నంబర్‌కు సంప్రదించిన అమాయక ప్రజలను నమ్మించి, ముందుగా అడ్వాన్స్ చెల్లించాలని చెప్పి వారి నుంచి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు తీసుకుని మోసానికి పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో, మార్కూక్ గ్రామానికి చెందిన సాయిరెడ్డి, శంకర్ రెడ్డి యూట్యూబ్‌లో వీడియోలు చూసి నిందితుడిని సంప్రదించి 10 బర్రెలు కావాలని కోరగా, వాటి ధర రూ.15 లక్షలు అని చెప్పి సుమారు రూ.2,50,000 అడ్వాన్స్‌గా ఆన్‌లైన్ ద్వారా తీసుకున్నాడు. అనంతరం బర్రెలను ఎప్పుడు పంపిస్తారని బాధితుడు పలుమార్లు సంప్రదించినప్పటికీ నిందితుడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకపోవడంతో తాను మోసపోయినట్లు గ్రహించాడు. బాధితుడు సైబర్ ఫిర్యాదు చేయగా, మార్కూక్ పోలీస్ స్టేషన్ సైబర్ క్రైం కేసు నమోదు చేయబడింది. గజ్వేల్ రూరల్ సీఐ డి. రవి రాజు ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో నిందితుడిని గుర్తించి, అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి గజ్వేల్ న్యాయస్థానం ముందు హాజరుపరిచి



జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తులో నిందితుడు ఇదే తరహాలో మరికొందరిని కూడా లక్షల వరకు మోసం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు నాగర్‌కర్నూల్ మరియు వికారాబాద్ జిల్లాలో కూడా ఇదే తరహాలో కేసులు నమోదైనట్లు గుర్తించారు. ఈ సందర్భంగా గజ్వేల్ రూరల్ సీఐ డి. రవి రాజు ప్రజలకు సూచిస్తూ, యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికల్లో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలను గుడ్డిగా నమ్మవద్దని, వస్తువులను కొనుగోలు చేసే ముందు విక్రేత వివరాలు పూర్తిగా ధృవీకరించుకోవాలని,ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియని వ్యక్తులకు ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపవద్దని సూచించారు. అదేవిధంగా, ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు కాల్ చేసి లేదా లిలిలి.ఇఎవతీఇతీతిఎవ.ఐనీల.తిని వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రజకుల భూములను ఆక్రమిస్తే సహించం: ఐకాసా నాయకులు

**ఆళ్లగడ్డ14:** కులమతాలకు అతీతంగా సర్వ మతాలవారు రజకులను తమ ఇంటి ఆడపడుచు గా భావిస్తారు అలాంటి రజకుల భూములపై కన్నేస్తే సహించబోమని అఖిలభారత రజక సంఘం నాయకులు నాగేంద్ర పేర్కొన్నారు. ఆళ్లగడ్డ మండల పరిధిలోగల బత్తలూరు గ్రామంలో ఒకపక్క కులవృత్తి చేసుకుంటూ మరో ప్రక్క ప్రభుత్వం తమకు ఇచ్చిన భూములలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్న రజకులకు చెందిన భూములను అదే బత్తలూరు గ్రామానికి చెందిన కొంతమంది అగ్రవర్ణాల వారు కబ్జా చేసుకున్నారు పలు సంవత్సరాల నుండి రజకులను తమ సొంత పొలాల వద్దకు కూడా రాకుండా తమ పరపతి పలుకుబడితో అడ్డుపడుతూ భూములకు దూరంగా ఉంచుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాలకుల వద్దకు తమ మొరను తీసుకొని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేస్తున్న పట్టించుకోకపోవడంతో అఖిలభారత రజక సంఘం నాయకుల దృష్టికి బాధితులు సమస్యను తీసుకుని వెళ్లి తామపడుతున్న గోసను వెల్లబోసుకున్నారు. విషయం తెలుసుకున్న అఖిలభారత రజక సంఘం రాయలసీమ ఇంచార్జ్ నాగేంద్ర ఆళ్లగడ్డ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాళ్ళ భాషా, బీసీ సంఘం నాయకుడు సుబ్బయ్య, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బి చంద్రశేఖర్ తదితర కుల, మత సంఘాల నాయకులతో కలిసి వివాదాస్పద భూమిని బాధితులతో కలిసి పరిశీలించారు. అక్కడ వారు ఎదుర్కొన్న సమస్యలను వారి ద్వారానే విని ప్రజాసంఘాల నాయకులు చలించి పోయారు. రజకులు తాము ఉతికిన బట్టలను ఆరబోసుకోవడానికి సైతం స్థలం లేక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని మహిళలు బోరున విలపించారు. ఈ సందర్భంగా ప్రజాసంకల్ప నాయకులు బీరువాల భాష సుబ్బయ్య నాగేంద్ర లు మాట్లాడుతూ అగ్రవర్ణాల దౌర్జన్యం అణగారిన వర్గాల వారిపై ఇకా ఎంతకాలం సాగదని అన్నారు. నియోజకవర్గ కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామంలో ఇంత దాష్టకం జరుగుతున్న స్థానిక సచివాలయ సిబ్బంది కానీ ఎమ్మార్వో కార్యాలయం వారు కానీ స్పందించడం లేదంటే అవతలి వారి పలుకుబడి పరపతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని అన్నారు. రజకులకు చెందిన భూములను వారికి తిరిగి అప్పగించకపోతే రాజ్యాంగబద్ధంగా చట్టానికి లోబడే అక్రమార్కులపై న్యాయపోరాటం చేస్తామని నాయకులు హెచ్చరించారు. అలాగే ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఈ ఘటనపై తక్షణమే స్పందించి బాధితులను పరామర్శించి భూ ఆక్రమణకు పాల్పడిన భూ బకాసురులపై తగిన చర్యలు తీసుకోవాలని వినమ్రతా పూర్వకంగా కోరుకుంటున్నామని ఐకాసా నాయకులు మీడియా ముఖంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాల భాష బీసీ సంఘం నాయకుడు సుబ్బయ్య మాల మహానాడు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, మాల మహానాడు జిల్లా జాయింట్ సెక్రెటరీ రాజేష్, రజక సంఘం సభ్యులు చిన్న పాములేటి, శీను ,రాజా , చిన్న దిబ్బన్న, జాల శేఖర్, సుబ్బారాయుడు, వెంకటసుబ్బయ్య, నరసింహుడు, పామన్న, పాములేటి, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ ఆది నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# సిరికొండ అభివృద్ధికి సహకరించాలి

**డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్‌ను కలిసిన ఆదివాసీ సర్పంచ్‌లు**

**జననినాదం, సిరికొండ 14:** సిరికొండ మండల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు మారుమూల గ్రామాలకు అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సిరికొండ మండలానికి చెందిన ఆదివాసీ సర్పంచ్‌లు డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్‌ను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల పరిస్థితులను వివరించిన సర్పంచ్‌లు, మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో పాటు సీసీ రోడ్లు, రేకుల షెడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా అవసరమైన సహకారం అందేలా కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంచం లక్ష్మణ్, నేరడిగొండ(జి) సర్పంచ్ పెందూర్ వందన గునవంత్‌రావు,



నారాయణపూర్ సర్పంచ్ చిక్రం విమలాబాయి రాము, కుంటాగూడ సర్పంచ్ కుమ్రా మీరాబాయి యాదవరావు, ఇచ్చోడ ఏఎంసీ డైరెక్టర్ పురక జగన్, బీఎల్ఏ సూపర్‌వైజర్ తొడసం భూపతి తదితరులు పాల్గొన్నారు.

# వానల కోసం కప్పతల్లికి మొక్కులు

**లచ్చింపూర్‌లో సంప్రదాయ పూజలు.. భీం దేవుని ఊరేగింపు**

**జననినాదం, సిరికొండ 14:** మండలంలోని లచ్చింపూర్ గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం సంప్రదాయబద్ధంగా కప్పతల్లి దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆటపాటల నడుమ గ్రామ శివారులోని భీం దేవత వద్దకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు చేసి వరుణదేవుని అనుగ్రహం కోసం ప్రార్థనలు చేశారు. వ్యవసాయ పనులు ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తూ కప్పతల్లి పూజలు నిర్వహించి, చెరువులు, కుంటలు నిండి పంటలు సమృద్ధిగా పండాలని గ్రామస్తులు వేడుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ విజయ్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు కప్పతల్లి పూజలు నిర్వహించడం గ్రామంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయమని తెలిపారు. వరుణదేవుని



కరుణతో మంచి వర్షాలు కురిసి రైతులకు మేలు జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బద్దం రామచంద్రారెడ్డి, ఛెనాల మల్లేష్‌రెడ్డి, దికొండ శ్రీనివాస్, భోనగిరి రాజు, వెంకటరమణారెడ్డి తదితరులతో పాటు గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యమే గ్రామాభివృద్ధికి బలమైన పునాది

**సర్పంచ్ మడావి పార్వతి అంబరావు సర్పంచ్ మడావి పార్వతి అంబరావు**



**జననినాదం, తిర్యాణి 14:** చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎదులపాడ్ గ్రామ సర్పంచ్ మడావి పార్వతి అంబరావు అన్నారు. మంగళవారం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో ఆమె విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలు పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలను తగ్గించడంలో దోహదపడతాయని తెలిపారు. పాఠశాలల్లో నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రతి విద్యార్థి పాల్గొనేలా తల్లిదండ్రులు సహకరించాలని, గ్రామంలో పిల్లల ఆరోగ్య పరిరక్షణకు పంచాయతీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ తొడసం ప్రమీల, ప్రధానోపాధ్యాయుడు చిక్రం భగవంత్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

**డాక్టర్ పల్లవి**

**జననినాదం, తిర్యాణి 14:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డీడీఓ డాక్టర్ పల్లవి అన్నారు. మంగళవారం తిర్యాణి మండలంలోని పెర్కపల్లి నాయకాపు గూడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులకు వైద్య సేవలు అందించడంతో పాటు అసంక్రమ వ్యాధుల (ఎన్‌సీడీ) స్క్రీనింగ్, రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించమన్నారు. జ్వరం, దగ్గు, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని, దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను నివారించేందుకు ప్రతి వారం డ్రైడే పాటించి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని పేర్కొన్నారు. అనంతరం ఎంపీపీఎస్ గంభీరావుపేట పాఠశాలను సందర్శించి



విద్యార్థులకు డ్రైడే కార్యక్రమాలపై అవగాహన కల్పించి, రాపిడ్ ఫీవర్ సర్వేతో పాటు చిన్నారులకు హీమోగ్లోబిన్ (హెచ్‌బీ) పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యూఓ శ్రీనివాస్, సూపర్వైజర్ రత్నమాల, ఏఎన్ఎమ్ మనెమ్మ, ఆర్‌బీఎస్‌కే బృందం సభ్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 14:** జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ --సెర్ప్ ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ, ఉపాధి కల్పన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ --సెర్ప్ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు కాని మహిళలకు యూనిఫాం చీరలు పంపిణీ చేసినట్లయితే, వారిని గుర్తించి వెంటనే సంబంధిత స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేర్పించాలని తెలిపారు. స్త్రీ నిధి బ్యాంక్ లింకేజీ కార్యక్రమానికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని, రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి నిరర్థక ఆస్తులు సున్నా స్థాయిలో ఉండేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. అన్ని రకాల పొదుపు, రుణ కార్యకలాపాలను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించాలని, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో సెర్ప్ సిబ్బంది భాగస్వాములు కావాలని తెలిపారు.



ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ సంస్థల అధికారికీకరణ పథకం క్రింద ప్రతి కమ్యూనిటీ కో- ఆర్డినేటర్ కనీసం ఇద్దరు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, యూనిట్ల స్థాపనకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని కార్యక్రమాలను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ--సెర్ప్ అధికారులు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు, కమ్యూనిటీ కో- ఆర్డినేటర్లు, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460